ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 | సంచిక : 09 | మే 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

సఖినేటిపల్లి... 04-02-2010

జిన్నూరు....... 07-03-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 04-02-2010, సఖినేటిపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏదైనా ఉద్యోగానికి వెళితే నువ్వు ఏమి చదువుకున్నావు, నీ క్వాలిఫికేషన్ ఏమిటి అని అడుగుతారు. అలాగే వేదాంతం వినటానికి కూడా ఒక క్వాలిఫికేషన్ ఉండాలి. అందరూ వింటే వినవచ్చు, వినటం మంచిదే కాని ఆ మాటలు వారి గుండెకు పట్టవు. వేదాంతం వినాలంటే ఎంతో కొంత పుణ్యబలం ఉండాలి, పవిత్రత ఉండాలి, క్రమశిక్షణ ఉండాలి, వైరాగ్యం ఉండాలి. జ్ఞానానికి పెట్టుబడి వైరాగ్యం అందుచేత వైరాగ్యం అవసరం. నీ మనస్సును, బుద్ధిని నాయందే ఉంచు అని పరమాత్మ చెప్పాడు. నీ చేతులతో ఏదైనా పని చేసుకొంటూ ఉన్నా నీ మనస్సులో మటుకు ప్రపంచాన్ని మోయకు, ఎంతకాలం అయితే నీకు శరీరం ఉందో అంతకాలం నీ మనోబుద్ధులను నాయందే ఉంచు అని పరమాత్మ చెపుతున్నాడు. అసలు వస్తువుకి రూపంలేదు, నామంలేదు. మనం ఉపాసన చేసుకోవటానికి నామరూపాలను ఏర్పాటు చేసారు. నామ రూపాలకు మనం పరిమితం అవ్వకూడదు. నామరూపాలను పట్టుకొని మనం పవిత్రులం అవ్వటానికి ప్రయత్నం చేయాలి. స్వధర్మం, పరధర్మం వీటికి పండితులు రకరకాలుగా అర్థం చెప్పారు. కులవృత్తులను విడిచిపెట్టకూడదని, వంశపారంపర్యంగా వారు ఏ పని చేసుకొంటున్నారో ఆ పని చేసుకోవాలని ఇలా పండితులు రకరకాలుగా చెప్పారు. దీనికి ఐన్‌స్టీన్ ఏమి చెప్పాడు అంటే ఎవడి స్వభావాన్ని బట్టి వాడు పనిచేసుకోవటం అది స్వధర్మం, వాడి స్వభావాన్ని విడిచిపెట్టేసి ఎవడో పది రూపాయలు ఎక్కువ సంపాదించుకొంటున్నాడని, ఎవడినో చూసి ఆశపడి వాడి చేతిలో ఉన్న పనిని వదిలేసి వాడి స్వభావానికి విరుద్ధమైన పనిచేస్తే అది పరధర్మం అని చెప్పాడు. ఎవడి స్వభావాన్ని బట్టి వాడు పనిచేస్తే చనిపోయేటప్పుడు దుఃఖం లేకుండా చనిపోతాడు. వాడి

స్వభావాన్ని విడిచిపెట్టి ఎవడో చేస్తున్నాడని ఆ పని చేస్తే చనిపోయేటప్పుడు దుఃఖంతో చనిపోతాడు అని చెప్పాడు.

ప్రతీవాడికి వాడి దేహం అంటే వాడికి బాగా ఇష్టం. మన దేహం మీద మనకు మోహం ఉన్నంతకాలం మన ఇంట్లోవారి దేహాల మీద కూడా మోహం ఉంటుంది, దానిని విడిచిపెట్టలేము, సాధన చేసినా అది పోదు. దేహాన్ని బట్టే వారికి మనకు సంబంధం కదా అందుచేత నా దేహంమీద నాకు మోహం ఉన్నంతకాలం ఇంట్లోవారి దేహాలమీద మోహం పొమ్మన్నాపోదు. ఆత్మజ్ఞానం సంపాదించాలని అందరికీ ఉంది కాని మనకు లోకవాసన ఎక్కువ. ఈలోకంలో ఏవో గౌరవాలు సంపాదించాలని ఇటువంటి గొడవలు మనకు ఎక్కువ ఉన్నాయి. ఎవరైనా మిమ్మల్ని పొగుడుతూ ఉంటే మీకు సంతోషం వస్తే మీకు లోకవాసన ఉన్నట్లు, ఎవరైనా మిమ్మల్ని తిడుతూ ఉంటే మీకు దుఃఖం వస్తూ ఉంటే మీకు లోకవాసన ఉన్నట్లు. లోకవాసన నశిస్తేగాని మీకు ఆత్మజ్ఞానం రాదు. శాస్త్రవాసన ఉన్నవాడు నేను పండితుడిని, నేను పండితుడిని అనుకొంటాడు, పాండిత్యం ఉన్నవారు ఒక్క అంగుళం కూడా లోపలకు దిగలేరు. అందుచేత మనం ఏమి చేయాలి అంటే ఒంటరిగా కూర్చుని మనలో ఉన్న బలహీనతలు, వాసనలు ఏమిటో జాగ్రత్తగా పరిశీలన చేసుకొని వాటిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయాలి. మీకు లోచూపు లేకుండా గుడులు చుట్టూ తిరిగితే సరిపోతుందా. మీరు ప్రశాంతంగా కూర్చొని మనకు కోరికలు, కోపాలు, ద్వేషం, అసూయ ఇవన్నీ ఉన్నాయా, ఉంటే ఇవి అన్నీ ఎందుకు వస్తున్నాయి అని విచారణ చేసుకోవటం మానేసి రాళ్ళచుట్టూ తిరుగుతావేమిటి. మన ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తుంది, దానితో నీవు తృప్తి పడాలి. అంతేగాని అది కావాలి, ఇది కావాలి అని కోరి తెచ్చుకొంటే అది దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మనం కోరుకోకుండా ఏదైనా వచ్చింది అనుకోండి, అది దుఃఖాన్ని తీసుకొని రాదు. కోరిక, కోపం, భయం వీటిని విడిచిపెట్టు అని పరమాత్మ చెపుతున్నాడు. అంటే నీకు కోరిక లేకపోతే, కోపం లేకపోతే, భయం లేకపోతే ఇంక మనస్సు ఎక్కడ ఉంది. నీకు మనస్సు ఉంది కాబట్టి కోరిక, కోపం, భయం. వాటిలో నుండి విడిపోతే ఇంక మనస్సు ఎక్కడ ఉంది. కోరిక, కోపం, భయం వాటిలో నుండి విడుదల పొందు అని పరమాత్మ చెపుతున్నాడు. అంటే వాటిలో నుండి విడిపోతే ఆయన స్వరూపాన్ని పొందుతావు.

దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఈ వాసనలకంటే పాములే మెరుగు. మన ఇంట్లో పాములు ఉంటే ఎంత ప్రమాదమో మన దేహంలో ఉన్న ఈ వాసనలు అంతకంటే ఎక్కువ ప్రమాదము. పాములు మన ఇంట్లోకి ఈ మధ్యనే వచ్చాయికాని వాసనలు అనే పాములు కొన్ని వేల జన్మలనుండి మన కూడా వస్తున్నాయి. అవి బుసలు కొట్టేస్తున్నాయి. ఏదో ఒక గొడవ వదిలిపోయింది అంటే ఇంకొక గొడవ వచ్చి మీద పడిపోతుంది. వాసనలు అనే పాములకంటే బయట పాములే మెరుగు అవి తరిమేస్తే పోతాయి. వాసనలు అనే

పాములు మన లోపలే ఉంటాయి మన దేహంతో, మనస్సుతో తాదాత్మ్యం పొంది ఉంటాయి. అందుచేత శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే నీ శరీరం చావకముందే ఈ వాసనలు అనే పాములను చంపు అప్పడు జీవన్ముక్తుడవు అవుతావు అని చెప్పారు. లోకంలో ఏమీ లేదు. ఈ మానవతాసంబంధాలు, ప్రేమలు కూడా నిజం కాదు. మనం భగవంతుడిలో విశ్రాంతి తీసుకోవాలి. మీకు ధనం, బంగారం, ఆస్తులు ఉంటే ఉండవచ్చు. వాటిలో విశ్రాంతి తీసుకోవటం నేర్చుకొంటే అవి పోయిన వెంటనే మీరు ప్రమాదంలో పడతారు. మీ అబ్బాయి బాగా చదువుతున్నాడు అనుకోండి. మా అబ్బాయి బాగా చదువుతున్నాడు, మా అబ్బాయి బాగా చుదువుతున్నాడు అని మీ మనస్సును అస్తమాను అక్కడవాలనివ్వకండి, అక్కడ విశ్రాంతి తీసుకోవద్దు. అక్కడ విశ్రాంతి తీసుకొంటే మీ కొంప మునుగుతుంది. మరల మీకు నీచమైన జన్మలు వస్తాయి. లోపల హృదయంలో నుండి తప్పించి, పరమాత్మలో నుండి తప్పించి మీరు ఎక్కడ సుఖాన్ని, శాంతిని తీసుకోవద్దు. దేనిలోను విశ్రాంతి తీసుకోవద్దు. బయట పదార్థముల నుండి ఎక్కడ నువ్వు సుఖాన్ని తీసుకొన్నా అది అంతా దుఃఖంగా మారిపోతుంది. పరమాత్మనే ఆధారంగా చేసుకొని సుఖపడు. నీ సుఖం కోసం బయట వ్యక్తుల మీద ఆధారపడవద్దు. వారు ఉండగా నీవు అయినా చనిపోవచ్చు, నువ్వు ఉండగా వారు అయినా చనిపోవచ్చు. సంయోగం వచ్చాక వియోగం తప్పదు.

మనకు భగవంతుడి మాటయందు గౌరవం లేదు, విశ్వాసం లేదు, అది గ్రహించటానికి తగిన తెలివితేటలు మనకు లేవు. మనం ఏదో సాధన చేసి అభివృద్ధిలోనికి రావటానికి ప్రయత్నం చేస్తాము అనుకోండి అప్పడు మీలో ఉన్న వాసనలు అనే పాములు బుసలు కొట్టటం ప్రారంభిస్తాయి. ఎందుచేతనంటే మనం సాధన ఈ మధ్యే ప్రారంభించాము. అవి కొన్ని వేల సంవత్సరాల నుండి మన కూడా ఉన్నాయి. ఈ రోజు నీకు భగవంతుడు కావలసి వచ్చాడా. మా మాట ఏమిటి అని అవి మన మీద యుద్ధం చేస్తాయి. ఈశ్వర పాదాలయందు భక్తిని పెంచుకోవటం, ఆత్మజ్ఞానం సంపాదించుకోవటం మీరు అనుకొన్నంత తేలిక కాదు. మీరు పూర్వజన్మలలో ఎంతోకొంత పుణ్యం చేసిఉండాలి, సత్కర్మ నిష్కామంగా చేసి ఉండాలి. మీకు శ్రవణం లేదు, మననం లేదు, ధ్యానం లేదు, మాకు ఆత్మజ్ఞానం వచ్చేయాలి అంటే ఎలాగ వస్తుంది. దానికి ఎంతో కృషి ఉండాలి. మనకు ఎంతసేపు బాహ్యదృష్టి తప్ప మనకు లోచూపు లేదు. మనం భగవంతుడి స్వరూపాన్ని పొందకుండా మనకు ఏమి అడ్డువస్తున్నాయి అని చూసుకొని వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేయకుండా ఎంతసేపు లోకం వంక చూస్తావు ఏమిటి? ఏముంది ఈ లోకంలో. మన దగ్గర చెడ్డ ఏమిటి అంటే మనకు డబ్బు పెరిగింది అనుకోండి, ఏదైనా పదవి వచ్చింది అనుకోండి ఇంక బంధువులకు, స్నేహితులకు, సమాజానికి దూరమైపోతాము. మనలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటాము. దానివలన దేహాభిమానం పెరిగిపోతుంది, ఇవన్నీ మన కొంపలు ముంచేస్తాయి. మనకు పద్మశ్రీ ఇచ్చారు అనుకోండి

నాలో ప్రత్యేకత ఉంది, నాలో ఏదో విశేషం ఉంది అనుకొంటాము. దానివలన మనం లోపల కుళ్ళిపోతున్నాము అని మనకు తెలియదు. కొంతమంది పదవులను గడ్డిపరక పడేసినట్లు పడేస్తారు. మనం అయితే వాటని భుజాన వేసుకొని తిరుగుతాము.

మనకు ఇంట్లో జరిగే ప్రతీ సంఘటన హిమాలయ పర్వతం కింద కనిపిస్తుంది. ఎంత గొడవ జరిగిపోయింది అనుకొంటాము. ఐన్‌స్టీన్ మొదటి భార్య 20 సంవత్సరాలు కాపురం చేసాక విడాకులు ఇస్తాను అంటే నీకు ఇష్టంలేకపోతే ఇచ్చేయి అన్నాడు. మామూలు వాడైతే కంగారుపడిపోతాడు, ఆయనకు ఎర్రచీమకుట్టినట్లు కూడా లేదు. సర్వసాధారణంగా విడాకులు ఇచ్చే భార్యమీద కోపం వస్తుంది, కానీ ఆయన ఏమన్నాడు అంటే నువ్వు ఆనందంగా ఉండాలి, శాంతిగా ఉండాలి, నాకు నోబుల్ బహుమతి వచ్చింది. అందులో వచ్చే డబ్బులో నీకు సగం ఇస్తాను అని చెప్పాడు. విడాకులు ఇచ్చే భార్యకు డబ్బులు ఎవడు ఇస్తాడు చెప్పండి. అంటే ఆయన మనస్సు, బుద్ధి ఎక్కడో ఉంది. ఆయన తెలుసుకోవలసిన విషయం వేరుగా ఉంది. భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నీ మనస్సును, బుద్ధిని నీకు ఇచ్చేస్తే ప్రపంచంలో జరిగే గొప్ప సంఘటనలు కూడా నీకు చిన్న సంఘటన క్రింద కనిపిస్తాయి, అవి నిన్ను బాధించవు. ఇందులో కొంతమంది రమణభక్తులు, కొంతమంది కృష్ణభక్తులు, కొంతమంది రామకృష్ణ భక్తులు ఇలా రకరకాల భక్తులు ఉన్నారు. ఐన్‌స్టీన్ కూడా భక్తుడే, ఆయన మనలాగా కాదు. ఈ సృష్టికంతా ఏ బ్రహ్మం అయితే ఆధారంగా ఉందో ఆ బ్రహ్మానికి భక్తుడు. మనకు రోజుకో దేవుడు, రోజుకో గురువు. ఈ తింగరతనం అంతా మన ఇంద్రియాలలో, మనస్సులో ఉంది. దేహంతోటి, మనస్సుతోటి, బుద్ధితోటి సంబంధం లేకుండా ఒక సత్యం మన హృదయంలో ఉంది. నా శరీరంతోటి నాకు ఎరుక ఎలాగ ఉందో, నా మనస్సుతోటి నాకు ఎరుక ఎలాగ ఉందో అలాగ వారు సత్యంతో ఎరుక కలిగి ఉంటారు, దానితో సంబంధం కలిగి ఉంటారు. ఐన్‌స్టీన్ ఈజ్ డివోటీ ఆఫ్ ట్రూత్.

నా దేహబుద్ధిని విడిచిపెట్టి, నా మనస్సును విడిచిపెట్టి నేను ఎవడిని ప్రేమిస్తాను, ఎవడినీ ప్రేమించలేను నాకు నేనే ముఖ్యం కాని ఇతరులు ముఖ్యంకాదు, దేవుడిని ఎవడైతే కేంద్రంగా పెట్టుకొన్నాడో, దేవుడిని ఎవడైతే గమ్యంగా పెట్టుకొన్నాడో వాడు దేహబుద్ధికి దూరమైపోతాడు. మనం చేసే పనులకు, మనం మాట్లాడే మాటలకు అహంకారం కేంద్రం కాని దేవుడు కేంద్రం కాదు. మన మాటలు, చేతలు అన్నీ దేహాభిమానంలో నుండే వస్తాయి. ఈ శరీరం ఉండగానే సాధన చేసి దేహాభిమానాన్ని విడిచిపెట్టు. దేహాభిమానం ఊరికే పోతుందా దానికి మూల్యం చెల్లించాలి. షాపుకు వెళ్ళి చీర ఇమ్మంటే ఊరికే ఇస్తాడా దాని ఖరీదు ఎంతో అది మనం చెల్లించాలి. అలాగే దేహాభిమానం పోవాలంటే నీవు మూల్యం చెల్లించాలి, వైరాగ్యం అనే ధనం చెల్లించాలి. వైరాగ్యం లేకుండా దేహాభిమానం పోదు. మనకు వివేకం లేదు, వైరాగ్యం లేదు, సత్పురుషుల సహవాసం లేదు, వ్యక్తిభావనను త్యాగం చెయ్యలేము ఏమీ

లేకుండా జ్ఞానం వచ్చేయాలి అంటే ఎలా వస్తుంది. మనందరం భక్తులం కాదు, భక్తులము అని పిలువబడే వ్యాపారస్తులం. మీరు గుడికి వెళ్లినప్పుడు దేవుడిని నాకు నువ్వే కావాలి అని కోరుకొంటున్నారా లేక లోకవిషయాలు కోరుకుంటున్నారా? వెళ్ళటం దేవుడి దగ్గరకు వెళుతున్నాము, లోకానికి దగ్గరయ్యే విషయాలు అడుగుతున్నాము. మనం ప్రపంచాన్ని మోసం చేయగలము కాని భగవంతుడిని మోసం చెయ్యలేము. మోక్షం అనే తాళం చెవి భగవంతుడి దగ్గర ఉంది. నువ్వు ఆయనను కోరుకొంటే నీకు మోక్షం వస్తుంది కాని లోకవిషయాలు అడిగితే మోక్షం ఎలా వస్తుంది. మీ శరీరానికి ఒక భర్త ఉన్నాడు కాని మీ జీవుడికి భర్త భగవంతుడే. మీ దేహప్రారబ్దాన్నిబట్టి ఆ ఇంట్లో దేహం వచ్చింది, పూర్వజన్మ అనుబంధాన్ని బట్టి మీరు భార్యాభర్తలు అయ్యారు కాని మీ జీవుడికి భర్త భగవంతుడే. అందుచేత భగవంతుడిలో ఐక్యమయ్యే వరకు ఈ జీవుడికి విశ్రాంతి లేదు. వాడి యాత్ర ముగియదు. మనం భగవంతుడిలో ఐక్యమవ్వటానికి ఇష్టపడటంలేదు, ఆయనకు దూరంగా ఉండటానికి, ఆయనను కోరికలు అడగటానికి ఇష్టపడుతున్నారు. అద్వైతానుభవం మాట అటు ఉంచండి అసలు మనకు అద్వైతవాసనే లేదు.

అమృతానుభవం పొందేవరకు నువ్వు వేరు, నేను వేరు అనే బుద్ధి పోదు. మిమ్మల్ని నాకు వేరుగా చూస్తున్నానా, నాలో ఒక భాగంగా చూస్తున్నానా? నన్ను చూసి నేను భయపడను. మిమ్మల్ని చూస్తే నేను భయపడుతున్నాను. నన్ను నేను ఎలా చుసుకొంటున్నానో, మిమ్మల్ని కూడా అలా చూసేటువంటి ఆశక్తి నాకు వచ్చేవరకూ భయం విడిచిపెట్టదు, కోరిక విడిచిపెట్టదు, ద్వేషం విడిచిపెట్టదు. మనకు చెవులు ఉండి భగవంతుడు చెప్పిన మాటలు వినలేకపోతున్నాము. కళ్ళు ఉండి చూడలేకపోతున్నాము. అర్హత లేనప్పడు, యోగ్యత లేనప్పడు భగవంతుడి మాటలు కూడా మనకు విషంలాగ ఉంటాయి. నీలో లేనిది నువ్వు బయట చూడలేవు. కృష్ణుడికి ఎంత ఔన్నత్యం ఉన్నా నీలో ఆ ఔన్నత్యం లేనప్పడు కృష్ణుడిలో అది నీకు కనబడదు. నీలో ఎంతోకొంత మంచి లేకపోతే నీ కళ్ళకు ప్రతీవాడు చెడ్డవాడికింద కనిపిస్తాడు. నీలోపల ఉన్నది బయట కనిపిస్తుంది కాని నీలో లేనిది బయటకనబడదు.

నీ మనస్సును, బుద్ధిని రెండింటిని నాకు ఇచ్చేస్తే శరీరం ఉన్నప్పడు, శరీరం పడిపోయిన తరువాత కూడా నాయందు బతుకుతావు అంటున్నాడు పరమాత్మ. అంటే అహంకారంలో చనిపోతావు, ఆత్మలో జీవిస్తావు. ఇక్కడ చావు అక్కడ బతకటం రెండూ ఒకేసారి కలుగుతుంది. మీ దేహానికి సంబంధించినంతవరకు, లోకానికి సంబంధించినంత వరకు ఈ శరీరం ఉండగానే మనం చనిపోవాలి. ఇక్కడ చనిపోతే చైతన్యంలో మేల్కొంటారు. అప్పటివరకు మిమ్మల్ని భయం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు, కోరికలు విడిచిపెట్టవు. ఒకవేళ నువ్వు పూజలు, జపాలు చెయ్యలేకపోతున్నావు అనుకో కొద్దిగా మంచికర్మ చెయ్యి. నీ పని ఏదో నువ్వు చేసుకొంటూ కొంచెం స్వార్థం విడిచిపెట్టి ఇతరులకు ఉపయోగపడే పనులు

చెయ్యి. అంటే భగవంతుడు సంతోషించే పని చెయ్యి. మీ ఆయనకు మీ మీద కోపం వచ్చింది అనుకోండి ఆయనను సంతృప్తి పరచటానికి ఎన్ని తిప్పలు పడతారో. ఒక వ్యక్తి సంతోషం కోసం ఇంత టైమ్ వేస్టు చేస్తూ ఉంటే దేవుడిని సంతోషపెట్టటానికి ఒక్క మంచి పని చేయవా? మీరందరు వేదాంతం వింటే మటుకు మీకు ఏమైనా తెలుస్తుందా. అర్హత లేకుండా విన్నా అంత ప్రయోజనం ఉండదు. నీ మనస్సును నిర్మలం చేసుకొని, ఎంతోకొంత బుద్ధిసూక్ష్మత పెంచుకొని అప్పడు వేదాంతం విను.

ఎవరిపట్ల నాకు ద్వేషం లేదు అని మీరు అనవచ్చు, మీకు ఎవరిపట్ల ద్వేషం లేకపోతే మీరు పవిత్రులు అయిపోయారు కదా. మీరు నిజంగా పవిత్రులు అయితే మీకు మోక్షం ఎందుకు రావటం లేదు. గడ్డితాడులో ఉన్న గడ్డిపరకలు అన్నీ తీసేస్తాము అనుకోండి ఇంక తాడు ఎక్కడ ఉంది. నీకున్న ద్వేషం, కక్ష, భయం, కోరికలు ఇవే మనస్సు. వాటిని తీసేస్తే మనస్సు అంటూ లేనేలేదు. ఇంక నిగ్రహించుకోవటానికి ఏమి ఉంది. కొంతమంది శరీరాలు ఎంత అందంగా ఉంటాయో కొంతమంది అంత దయాస్వరూపులు ఉంటారు. ఎవరికి బాధ కలిగినా వారికే బాధ వచ్చింది అనుకొంటారు, అలా ద్రవించిపోతారు. వారు మాట్లాడుతూ ఉంటే దయ ఉట్టిపడుతూ ఉంటుంది. వారి నేత్రాలు దయతో, ప్రేమతో, ఆప్యాయతతో నిండి ఉంటాయి. అటువంటి దయాస్వరూపుడి యొక్క ఒక్కమాట సరిపోతుంది, ఒక్కచూపు సరిపోతుంది. మీకు బండెడు దుఃఖం ఉన్నా వారు ఒక్కసారి మీ వంక చూస్తే మీ దుఃఖం అంతా ఆరిపోతుంది, మీరు జీవన్ముక్తులు అయిపోతారు. కొంతమందికి మొదటిరోజున స్నేహం ఎలా ఉందో ఆ దేహాలు చనిపోయవరకూ స్నేహంగానే ఉంటారు, అదీ మైత్రి. ధుర్యోధనుడికి కర్ణుడికి అటువంటి మైత్రి. ధుర్యోధనుడు దుర్మార్గుడు అని ఎవరైనా కర్ణుడితో చెపితే మీ కంటికి దుర్మార్గుడి కింద కనిపించవచ్చు కాని నాకు ఏమీ లేనప్పడు నన్ను చేరతీసి ఆదరించాడు ఇప్పడు వాడికి కష్టకాలం వచ్చినప్పడు మీ చెప్పడు మాటలు విని వాడిని వదిలేస్తే అది మైత్రా. మీకు సంబంధించినంత వరకు వాడు చెడ్డవాడు అవ్వవచ్చు కాని నేను వాడిని విడిచిపెడితే అది మైత్రి ఎలా అవుతుంది. అంటే ఒకరు చేసిన పొరపాట్లను ఒకరు మన్నించుకొంటారు. మీ అమ్మాయి మిమ్మల్ని ఏమైనా అనవచ్చు, మీరు మీ అమ్మాయిని ఏమైనా అనవచ్చు. ఏదో కంగారులో అలా అంది, రజోగుణంలో ఉండి అలా అంది అని సమాధానపడాలికాని దీర్ఘకాలం లోపల కోపం పెట్టుకోకూడదు. మంచివారికి కూడా ఎప్పడైనా కోపం రావచ్చు అది నీటిమీద గీత లాంటిది. చెడ్డవారికి కోపం వస్తే చనిపోయేవరకూ ఆ కోపం అలాగే ఉంటుంది. ఆచార్యులవారికి, పద్మపాదుడికి ఉన్నది మైత్రి. వారు మొదటి చూపులోనే ప్రేమించుకొన్నారు, చనిపోయేవరకూ అలాగే ఉన్నారు. అది జన్మాంతర అనుబంధం. మనకు పూర్వజన్మలో ఏమీ అనుబంధం లేదు అనుకోండి, ఒకవేళ స్నేహం కలిసినా విడిపోతారు. మన మొదటి రాష్ట్రపతి బాబురాజేంద్రప్రసాద్. వారు మానవరూపంలో ఉన్న ఋషులు.

ఆయనకు నెలకు పదివేల రూపాయలు జీతం ఇస్తే నాకు జీతం ఎక్కువ ఇస్తున్నారు, తగ్గించండి అని చెప్పేవాడు. ఆయన గాంధీగారి గురించి ఒక మాట చెప్పారు. ఒక కప్పులో విషంపోసి రాజన్‌బాబు ఇది విషం నువ్వు తాగేయి అని గాంధీగారు చెపితే విషం ఎందుకు తాగమంటున్నారు అని అడగకుండా తాగుతాను అని చెప్పాడు. అవి హృదయగతమైన అనుబంధాలు, అవి మన మాటలకు అందవు, మన మనస్సుకు అందవు.

ఎక్కడ ఆప్యాయత పెట్టకూడదో అక్కడ ఆప్యాయత పెడితే, ఎక్కడ మనస్సు పెట్టకూడదో అక్కడ మనస్సు పెడితే అటువంటి ఆప్యాయతలు, ప్రేమలు నరకానికి మెట్లు అవుతాయి. సంసారానికి సంబంధించినంతవరకు, లోకానికి సంబంధించినంతవరకు నీ డ్యూటీ ఏదో చెయ్యి, నీ మనస్సును బుద్ధిని వాళ్ళకు ఇవ్వకు, నీ మనస్సును, బుద్ధిని నాకు ఇయ్యి, అప్పుడు నన్ను పొందుతావు అని పరమాత్మ చెపుతున్నాడు. మనిషి కూడా నీడ వచ్చినట్లుగా నేను అనే తలంపు ఉన్నప్పుడు నాది అనే తలంపు నీ కూడా వచ్చేస్తుంది. ఈ రెండు నిన్ను గట్టిగా పట్టుకొన్నాయి, వాటి పట్టులో నుండి విడుదలపొందు, అదే సాధన. ఏదో బండతనంగా చేయటంకాదు. వివేకం, వైరాగ్యం సంపాదించుకొని అభ్యాసం చేసి నేను అనే తలంపు, నాది అనే తలంపుల నుండి విడుదల పొందు. ఇది అంత తేలికకాదు. గురువు దయలేకుండా, ఈశ్వరుని పాదాలయందు భక్తి లేకుండా వీటిలో నుండి మనం బయటకు రాలేము. మీరు పరమాత్మ మీద ప్రేమ పెంచుకోండి, ఆయనతో అనుబంధం పెట్టుకోండి, ఆయన దగ్గర విశ్రాంతి పొందండి. లోకానికి సంబంధించిన వారు మీకు మోక్షాన్ని ఇవ్వరు, పరమాత్మే మీకు మోక్షాన్ని ఇస్తాడు. అందుచేత ఆయన మాటలు వినండి, ఆయన రూపాన్ని ధ్యానం చేయండి, ఆయన నామాన్ని స్మరించండి. ఏది నిజమో మీకు తెలియకపోయినా, మీరు ప్రేమించే పరమాత్మకు తెలుసు. అక్కడకు చేరుకొనే వరకు ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు. నేను అనే తలంపు, నాది అనే తలంపులో నుండి విడుదల పొందేవరకు ఆయన వెంటాడుతూనే ఉంటాడు.

నువ్వు మోహించడానికి ఏముంది ఈ లోకంలో, నీవారు అంటూ అసలు ఎవరు ఉన్నారు ఈ లోకంలో. ఇప్పుడు మీకు సంపద ఉంది అనుకోండి. ఆ సంపదపోతే మీ బంధువులు, స్నేహితులు 24 గంటలలో మిమ్మల్ని వదిలేస్తారు. మొద్దబ్బాయి దెబ్బ తగిలేవరకు గ్రహించలేరు, తెలివిగలవాడు అయితే దెబ్బ తగలకముందే భగవంతుడి వాక్యాన్ని ప్రమాణంగా తీసుకొని జీవిస్తాడు. ఆ స్థాయి మనకు లేదు. మీ శరీరాలు మీ దగ్గరపెట్టుకోండి. మీ ఆస్తులను మీ దగ్గర పెట్టుకోండి, మీ ధనాన్ని మీ దగ్గర పెట్టుకోండి, మీ మనస్సును, బుద్ధిని నాకు అర్పించి పనిచెయ్యండి అని పరమాత్మ అడుగుతున్నాడు. మనం అసత్యానికి, దుర్మార్గానికి గాలి కొడతాము, మనం ద్వేష స్వరూపులం, కలహప్రియులం. ఎక్కడ ఎవరు ఏ పొరపాటు చేసినా, పొరపాటుగా ఆలోచించినా, పొరపాటుగా మాట్లాడినా లోపల వాడికి స్వార్థం ఉంటుంది. ఈ శరీరానికి చావు రాకముందే స్వార్థం ఎవడికైతే చావదో వాడు మోక్షాన్ని

పొందలేడు. సర్వసాధారణం మానవుడు ఏ పని చేసినా స్వార్థం కోసమే చేస్తాడు, తన స్వార్థం కోసమే జీవిస్తాడు. నువ్వు స్వార్థంలో నుండి విడుదల పొందు. స్వార్థం లేనివాడికి ఎవరిపట్ల ద్వేషం ఉండదు, కోపం ఉండదు, నీ బుద్ధిని బట్టి ఫలితం రాదు. ఈశ్వరుడి ఆజ్ఞను బట్టి ఫలితం వస్తుంది. కొంతమంది ఏదైనా తినాలని ఉన్నా ఎవరిని అడగరు. ఈశ్వరుని ఆజ్ఞ అయితే ఎవరో ఒకరు పెడతారు అనుకొంటారు. మనిషికి రెండే చేతులు, భగవంతుడికి వెయ్యి చేతులు, రెండు చేతులు ఉన్నవాడు పెట్టకపోయినా వెయ్యిచేతులు ఉన్నవాడు పెడతాడు.

మనోనాశనం అవ్వాలంటే బుద్ధుడు, శంకరుడు, రమణుడు వంటి మహాజ్ఞానులు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవించాలి. రమణమహర్షిగారు మాట్లాడుతూ ఉంటే ఈయన ప్రమాణబుద్ధితో మాట్లాడుతున్నాడు ఏమిటి అని పండితులు అనేవారు. ఆయన చెప్పేది ప్రమాణం అని ఆయనకు అనుభవంలోనికి వచ్చాక అప్పుడు మాట చెప్పేవారు. అంతేగాని ఏదో గౌరవాలకోసం మాటలు చెప్పరు. ప్రపంచం లేనివాడికి గౌరవం ఏమిటి, అగౌరవం ఏమిటి. మీరు ప్రపంచానికి సంబంధించినంతవరకు చావండి. అప్పుడు ఇంక మీకు గౌరవాలు అక్కరలేదు, అగౌరవాలు అక్కరలేదు. మీరు ఆహార విషయంలో, మాట్లాడే మాటల విషయంలో జాగ్రత్తగా ఉండండి, మేము జాగ్రత్తగానే ఉంటున్నాము అంటే సత్యాన్ని తెలుసుకోవటానికి ఇంకా జాగ్రత్తగా ఉండండి. మీరు చేసే సాధనలో మీ ఇంద్రియాలు, మనస్సు, మీ దేహం సహకరించాలి. వాలు గాలిలో సైకిలు ఎంత వేగంగా వెళ్ళిపోతుందో అలాగే మన ఇంద్రియాలు, దేహం, మనస్సు మనకు సహకరిస్తూ ఉంటే అంత వేగంగా వెళ్ళి సత్యంలో ఐక్యమవుతాము. భగవంతుడి మాటలలో తెలివి చూడండి. మేము జాగ్రత్తగా ఉంటున్నాము అంటే మీరు జాగ్రత్తగా లేరు అని అనడు, ఇంకా జాగ్రత్తగా ఉండండి అంటాడు. మేము నిరాడంబరంగా ఉంటున్నాము అంటే మంచిదే ఇంకా నిరాడంబరంగా ఉండండి అని చెపుతాడు.

న్యూటన్ ఏమని చెప్పాడు అంటే లోపల ఉన్న సద్వస్తువు మీరు అన్వేషించినంత మాత్రం చేత అది దొరకదు. అది ఎంత పవిత్రమైనదో, ఎంత దోషరహితమైనదో మీ బుద్ధి కూడా అంత దోషరహితమైతేనే ఆ సద్వస్తువు దొరుకుతుంది కాని మీ బుద్ధిలో దోషాలు పెట్టుకొని వెతికినా అది దొరకదు. పట్టకారును మన చెయ్యి పట్టుకొంటుంది కాని పట్టకారు మన చెయ్యిని పట్టుకోలేదు. అలాగే ఒక శక్తి ఈ సృష్టినంతా పట్టుకొని ఉంది. ఏ వస్తువు అయితే ఈ సృష్టినంతా పట్టుకొని ఉందో ఆ వస్తువును ఈ సృష్టి పట్టుకోలేదు, మీకు లోచూపు కలిగితే దానిని దర్శిస్తారు. దాని దయలేకుండా అది మనకు ఎరుకపడదు. నాలుగు గోడలకే మీ భక్తి పరిమితం అవ్వకూడదు. మీ మాట, చేత, ప్రవర్తన, ఆలోచన అన్నీ కూడా భగవంతుని దయను సంపాదించటానికి అనుగుణంగా ఉండాలి, డబ్బు, గౌరవం సంపాదించటానికి మీరు ఎలా ప్రయత్నం చేస్తారో అలాగ భగవంతుని దయను పొందటానికి ప్రయత్నం చేయండి. ఈ లోకంలో అన్నీ ప్రేమలకంటే తల్లిప్రేమ గొప్పది. చెడ్డ సంతానం ఉంటారుగాని చెడ్డ తల్లి

ఉండదు. ఒక తల్లికి నలుగురు కొడుకులు ఉంటే అందులో ముగ్గురు బాగా ఉన్నారు అనుకోండి, ఒకడు పాడైపోయాడు అనుకోండి. తల్లికి పాడైపోయిన కొడుకు మీద ఉంటుంది, వీడిని ఎలాగ బాగు చెయ్యాలి అని చూస్తుంది, అది నిజమైన ప్రేమ. మనం డబ్బు ఉన్నవారిని ప్రేమిస్తాము, డబ్బులేనివారిని అసలు మనుషులకింద చూడము. తప్పిపోయిన గొర్రెలు అంటే నాకు ఇష్టం అన్నాడు ఏసు. అంటే పాడైపోయినవారిని బాగుచేయటం కోసం వారు అంటే నాకు ఇష్టం అని చెప్పాడు. మనం పాడైపోయిన వారిని వదిలేస్తాము. పచ్చగా ఉన్నవారి వెనకాల తిరుగుతాము అందుచేత మనం మనుషులం అయ్యాము, ఆయన దేవుడు అయ్యాడు.

బాహ్యపరిస్థితులతో సంబంధం లేకుండా, మీ ఆస్తిపాస్తులతో సంబంధం లేకుండా కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా మీకు ఎప్పుడైనా శాంతి కలుగుతోంది అనుకోండి, అది మీ సొంతం కాదు. అది దేవుడిది అయి ఉండాలి, గురువుది అయి ఉండాలి. అది మీ సొంతం అనుకొంటే మిమ్మల్ని మీరు వంచన చేసుకొన్నట్లు. దేవుడు ఇచ్చిన శాంతిని, గురువు ఇచ్చిన శాంతిని మనం పొందుతూ, అది మన సొంతం అనుకొంటే అది దేవునిపట్ల అపచారం. అది గురువు ప్రసాదించింది, దేవుడు ప్రసాదించింది అనే తలంపు మనకు రావటం లేదు ఎందుచేతనంటే మనకు పుణ్యబలం లేదు. దేవుడు ఇచ్చింది మన సొంతం అనుకొంటే మీకు అవగాహన లోపం ఉంది. ఐన్‌స్టీన్ నాలుగు రోజులకు చనిపోతాడు అనగా కొంతమంది డాక్టర్లు వచ్చి మీ తలకాయలో ఏదో ఉంది. మీరు చనిపోయిన తరువాత మీ తలను హాస్పటల్‌కు తీసుకొనివెళ్ళి అందులో ఏముందో చూస్తాము అన్నారు. ఐన్‌స్టీన్ ఏమన్నాడు అంటే అందరి తలకాయలు ఎటువంటివో నా తలకాయ అటువంటిదే. నేను ఏదైనా కనిపెడితే అది దేవుని దయవలన కనిపెట్టాను. నాకు ఏదైనా ఉదాత్తమైన ఆలోచనవస్తే అది దేవునిదయ వలన వచ్చింది. అంతా దేవుని దగ్గర నుండి వచ్చిందేకాని నా తలకాయలో నుండి ఏమీ రాలేదు. మీరు చెప్పే ప్రతిభ అంతా దేవుని దగ్గర నుండి వచ్చింది. మీరు స్తోత్రం చేస్తే దేవుడికి స్తోత్రం చెయ్యండి అంతేగాని ఈ పనికిరాని వాడిని ఎందుకు స్తోత్రం చేస్తారు అని చెప్పాడు.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని దృఢమైన నిశ్చయం కలిగి ఉండి, ఆయన మీద గౌరవం కలిగి ఉండి, ఆయన మాటను ప్రేమించి, ఆయన మాట ప్రకారం జీవించటం నేర్చుకోండి, ఎవరి స్నేహాలు చేస్తే భగవంతుడి మాట యందు గౌరవం ఏర్పడుతుందో అటువంటి స్నేహాలు మాత్రమే చెయ్యండి. నీ బుద్ధిలో దోషం ఉంది కాబట్టి వారి బుద్ధిలో దోషం కనిపిస్తోంది. నీ బుద్ధిలో దోషం లేకపోతే వారి బుద్ధిలో దోషం ఉన్నా నీకు కనబడదు. వారి బుద్ధిలో ఉన్న దోషాలు వెతికేబదులు అంతకంటే రెట్టింపు దోషాలు నీ బుద్ధిలో ఉన్నాయి వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పుడు నీ బుద్ధికి స్పష్టత వస్తుంది, దేవుని మాట అర్థమవుతుంది, అప్పుడు దేవుడిలో నువ్వు విశ్రాంతి తీసుకోవటం నేర్చుకొంటావు. గాలి గట్టిగా

వీస్తూ ఉంటే ఆకులు ఊగిపోతాయి, చెట్లు ఊగిపోతాయి, నడిచివెళుతూ ఉంటే మనం కూడా ఊగిపోతాము కాని కొండలు ఊగవు. నీ విశ్వాసం కొండలాగ ఉండాలి. పునాది లేకుండా ఇల్లు కడితే ఎలా ఉంటుంది. పునాది గట్టిగా ఉండాలి. అలాగే ఈశ్వరుడి మీద నీకు ఉన్న విశ్వాసం బలంగా ఉండాలి. పునాదులు లేని కొంపలు ఎలా ఉంటాయో విశ్వాసం లేని సాధన అలాగే ఉంటుంది. అందుచేత ఎటుగాలి వీస్తే అటు ఎగిరిపోకుండా దృఢమైన విశ్వాసం కలిగి ఉండాలి.

నాకోసం జీవించేవాడు, నన్ను తెలుసుకోవటం కోసం సర్వస్వం విడిచిపెట్టినవాడు, అన్ని భోగాలు ఇంద్రియాలకు అందుబాటులో ఉన్నా భోగకాంక్ష లేనివాడు నాకు నిజమైన భక్తుడు. రామకృష్ణ పరమహంసగారు ఏమని చెప్పారు అంటే ఒక చెట్టు మీద పక్షులు ఉన్నాయి అనుకోండి ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి డబ్బా వాయిస్తే ఆ పక్షులు అన్నీ ఎగిరివెళ్ళిపోతాయి. అలానే మీరు దేవుని నామం శ్రద్ధగా చేస్తూ ఉంటే పూర్వజన్మలను బట్టి అలవాటు ప్రకారం వాసనలు వస్తూ ఉంటాయిగాని అవి వచ్చి వెనక్కి వెళ్ళిపోతాయి. పూర్వజన్మలనుండి వచ్చే వాసనలు అనే పాములు బుసలు కొడుతూ వచ్చి మీమీద పడతాయి. మీరు మాత్రం నామం విడిచిపెట్టకండి. నామం జాగ్రత్తగా, శ్రద్ధగా చేస్తూ ఉంటే ఆ బుసలు అణిగిపోయి అవి ప్రక్కకు వెళ్ళిపోతూ ఉంటాయి, అలా వెళ్ళిపోగా వెళ్ళిపోగా వాటికి మేత తగ్గిపోయి చివరకు నశిస్తాయి. ఈ లాభాలు నష్టాలు, జయాలు అపజయాలు, గౌరవాలు అగౌరవాలు, బహుమానాలు అవమానాలు ఇవన్నీ లోకానికి సంబంధించినవి, రోడ్డు మీద దుమ్ములాంటివి. మనం దుమ్ము కోసం తిరుగుతున్నాము, జీవితం పొడగునా ప్రయత్నం చేసి దుమ్మును పోగుచేసుకొంటున్నాము. మనం బియ్యపు గింజలు సంపాదించటానికి ప్రయత్నం చేయటంలేదు, ఆ పైన ఉన్న పొట్టును సంపాదించటానికి ప్రయత్నం చేస్తున్నాము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-03-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణుడు అర్జునుడికి చెప్పిన ఉపదేశం భగవద్గీత. అంటే అక్కడ అర్జునుడిని వంపుగా పెట్టుకొని మొత్తం మానవజాతికంతా ఆయన బోధించాడు, ఆయన బోధ జీవకోటికంతా వర్తిస్తుంది. ఇక్కడ అర్జునుడి స్థాయిలోకి రాకుండా భగవంతుడు ఆయన స్థాయిలోనే ఉండి బోధ చెప్పుకొంటూ వెళ్ళిపోయాడు. కృష్ణుడు భగవంతుడు అయి చెప్పాడు కాబట్టి దానిని భగవద్గీత అన్నారు. కృష్ణుడు ఆయన చివరిరోజులలో ఉద్ధవుడికి బోధ చేసాడు. అక్కడ పరమాత్మ ఉద్ధవుడి స్థాయిలోకి దిగిపోయి, ఏరకంగా చెపితే ఉద్ధవుడికి అర్థమవుతుందో ఆ రకంగా చెప్పాడు. దానిని ఉద్ధవగీత అంటారు. అర్జునుడిది కర్మమార్గం ఆయనకు తగినట్లుగా అక్కడ చెప్పాడు. ఉద్ధవుడిది భక్తిమార్గం, అందుచేత ఆయన మార్గంలో ఆయనను ప్రోత్సహిస్తూ

అది చెప్పాడు. భగవద్గీతకంటే ఉద్దవగీత అర్థం చేసుకోవటానికి తేలికగా ఉంటుంది. నువ్వు యుద్ధంలో నుండి పారిపోవద్దు, కర్మ చెయ్యి అని అర్జునుడికి భగవద్గీతలో చెప్పాడు. ఉద్దవగీతలో అయితే నువ్వు ఈ జనం మధ్యలో ఉండవద్దు, నీకు ఇక్కడ తగిన సత్సంగంలేదు, వీరితో స్నేహం వలన నీ భక్తి పాడవుతుంది అందుచేత నువ్వు బదరికాశ్రమానికి వెళ్ళిపో అని ఉద్దవుడికి పరమాత్మ చెప్పాడు.

మనం ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, అతిగా తినకూడదు. ఆహారం విషయంలో కనుక జాగ్రత్తగా లేకపోతే మన ఇంద్రియాల మీద, మనస్సు మీద మనకు ఆధిపత్యం రాదు. మనకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎంతోకొంత ఉందికాని ఆత్మజ్ఞాన సముపార్జనకు సరిపడలేదు. అది కావాలంటే ఆహారనియమం ఉండాలి. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉంటే ఆధ్యాత్మికంగా 100కి 50 మార్కులు వచ్చేసినట్లే. మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. శరీరాన్ని మనస్సును మనం చేసే సాధనకు ఉపయోగించుకోవాలి. ఎవరైనా మిమ్మల్ని పొగిడితే సంతోషిస్తారు, విమర్శిస్తే దుఃఖపడతారు. ఇవన్నీ జీవలక్షణాలు. సమాజంలో ద్వంద్వాలు ఉంటాయి, వీటి మధ్యలో ఉంటూ ఈ గౌరవాలకు, అగౌరవాలకు, పొగడ్తలకు, నిందలకు దూరంగా మీరు లోపల ఉండగలుగు తున్నారు అనుకోండి మీలో ప్రత్యేకత ఉన్నట్లు గుర్తు. అది మీరు ఈ జన్మలో అయినా సాధించి ఉండాలి, పూర్వజన్మలో అయినా సాధించి ఉండాలి. మీరు పూర్వజన్మలో చేసిన సాధన కూడా ఈ జన్మకు వస్తుంది. మీరు చేసిన సాధన గాని, చేసిన మంచిగాని వూరికే పోదు అని పరమాత్మ చెప్పాడు. కామక్రోధాలు ఎక్కువగా ఉంటే అవి మనలను సాధన చెయ్యనివ్వవు. ఇంట్లో అయినా, సమాజంలో అయినా మన డ్యూటీ మనం చెయ్యాలి కాని అక్కడ మమకారం పెట్టుకోకూడదు. దేహము, గేహము (గృహం) ఈ రెండింటి మీద మనకు మమకారం ఎక్కువగా ఉంటుంది. ఆ మమకారాన్ని తగ్గించుకొంటూ రావాలి. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోవాలి, ఇతరులకు సహాయం చేయగలిగిన శక్తి ఉంటే సహాయం చేయాలి. మీ తలంపులు, ఆలోచనలు అన్నీ భగవంతుడు చుట్టూ తిరుగుతూ ఉండాలి. అవసరంలేని పనులలోనికి వెళ్ళకండి. ఎవరైనా వచ్చి మిమ్మల్ని సలహా అడిగితే మీకు చేతనైతే చెప్పవచ్చు. వారు విన్నారని, వినలేదని మీకు అనవసరం. మీకు ప్రారబ్దం ఎలా ఉందో వారికి ప్రారబ్దం ఉంటుంది కదా. మీ సలహాకు, ఆ దేహప్రారబ్దానికి సంబంధం లేదు అనుకోండి మీ సలహా వారు వినరు. చెవిటి వాడికింద, మూగవాడికింద ఉండకండి. ఎవరైనా మంచిమాట చెపుతూ ఉంటే వినండి, చెవిటి వాడికింద ఉండవద్దు. ఎవరైనా మిమ్మల్ని సలహా అడిగితే మీకు తెలుసుంటే చెప్పండి. నోరుమూసుకొని కూర్చోవద్దు అంటే మూగవాడిగా ఉండవద్దు. సాధ్యమైనంతవరకు భక్తులతో సహవాసం చెయ్యండి. లౌకికులతో సహవాసం మంచిదికాదు.

మీకు వచ్చే తలంపులు మంచివి కాదు అనుకోండి, మీ అలవాట్లు మంచివికాదు

అనుకోండి కంగారుపడవద్దు. భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ, ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ, ఆయన పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఆయన దయ వలన మనస్సులో ఉన్న రోగాలు అన్నీ పోతాయి. సంసారం కూడా ఒక రోగం, ఇది మాయలోనుండి వచ్చింది, ఒకసారి మాయలో పడ్డాము అంటే ఇటువంటి శరీరాలు కోట్లాది శరీరాలు మోయవలసిందే, ఏ శరీరం వస్తుందో మనం చెప్పలేము. మన తలంపును బట్టి, ఆలోచనను బట్టి జన్మరాదు, మనం చేసిన కర్మనుబట్టి జన్మ వస్తుంది. భగవంతుడి దయ సంపాదిస్తే గాని ఈ మాయలో నుండి మనం బయటపడలేము.

ఆనకట్ట కట్టకముందు సముద్రంలోనికి నీరు ఎలా వెళ్ళిపోతుందో అలాగ జపధ్యానములు చేయకపోతే నీ మనస్సు వేగంగా విషయాల మీదకు వెళ్ళిపోతుంది. జపధ్యానములు ఆనకట్ట వంటివి. విషయాలమీదకు వెళ్ళిపోతున్న నీ మనస్సును ఆపి భగవంతుడి వైపుకి మళ్ళిస్తాయి. మనస్సుకు లోచూపును కలుగజేస్తాయి. జ్ఞానికూడా ప్రారబ్ధాన్ని అనుభవించవలసిందే అని శాస్త్రం చెప్పింది. మనస్సు బాహ్యముఖం అయినవాడికి ప్రారబ్ధం మాట నిజమే, అంతర్ముఖం అయిన వాడికి ప్రారబ్ధం ఏమిటి అన్నారు భగవాన్. దేహం ఉన్నవాడికి, లోకం ఉన్నవాడికి ప్రారబ్ధంకాని, దేహం ఉన్నా దేహవాసన లేనివాడికి, లోకం ఉన్నా లోకవాసన లేనివాడికి ప్రారబ్ధం ఏముంది అన్నారు. ఎందుకు వచ్చినమాటలండీ, మీ శరీర ప్రారబ్ధాన్నిబట్టి మీకు కేన్సర్ వచ్చింది, దానిని మీరు అనుభవిస్తున్నారు కదా, అదీ ప్రారబ్ధమే కదా అని అన్నాడు. రమణమహర్షి ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని చూసేవాడు అంటున్నాడు, నేను అనుకోవటం లేదు కదా. అలా అనుకొనేవాడు ఇక్కడలేడు కదా, ఇంక ప్రారబ్ధం ఏమిటి. వాడికి ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, ఎన్ని ఉన్నా వాడి మనస్సు బాహ్యముఖం అవుతూ ఉంటే ప్రారబ్ధం అనుభవించవలసిందే. జపధ్యానములు చేసి, విచారణ చేసి ఎవడైతే తన మనస్సును హృదయగతం చేసాడో ఇంక వాడికి ప్రారబ్ధం ఎక్కడ ఉంది. నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సే చెపుతోంది, అదే లేనప్పుడు ఇంక ప్రారబ్ధం ఏముంది.

భగవంతుడు బత్తాకాయలాంటివాడు. బత్తాయిలో తొక్క, తొనలు, లోపల రసం ఉంటుంది. అలాగే భగవంతుడికి సృష్టికి సంబంధించిన ఎడ్మినిస్ట్రేషన్ అంతా ఉంటుంది, బత్తాకాయలో ఉన్న రసం జ్ఞాని అయితే మొత్తం బత్తాకాయ అంతా కలిసి భగవంతుడు. పరమాత్మను తెలుసుకొన్నవాడు పరమాత్మ అయిపోతాడు అని ఒక స్వాములవారు చెప్పారు. పరమాత్మను తెలుసుకొన్నవాడు పరమాత్మ అయిపోడు, పరమాత్మ స్వరూపాన్ని పొందుతాడు, అంటే మోక్షం పొందుతాడు. బత్తాకాయ అయిపోడు, బత్తాయిలో ఉన్న రసం అవుతాడు ఇంక తొక్కల గొడవవాడికి అక్కరలేదు. మనం పిండి ఎలా రుబ్బుతామో అలాగ భగవంతుడు చెప్పిన మాటలను మీ మనస్సులో రుబ్బుకోండి. ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ ఆయన నామాన్ని స్మరించుకొంటూ ఉంటే ఇంక మీ మనస్సు ఎక్కడికి వెళుతుంది. అది బాహ్యానికి

వెళ్ళదు. మీ దేహయాత్రకు సరిపడ పనులు చేసకొని మీ మనస్సును, ఇంద్రియాలను నా చుట్టూ తిప్పకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. నన్ను ఆశ్రయించండి అని పరమాత్మ చెపుతున్నాడు. మనం డబ్బును ఆశ్రయిస్తాము, బంధువులను ఆశ్రయిస్తాము, లోకాన్ని ఆశ్రయిస్తాము కాని భగవంతుడిని ఆశ్రయించేవాడు ఎవడూ లేడు. బ్యాంకులో ఇంత డబ్బు ఉంది, మాకు స్నేహితులు ఉన్నారు, మాకు వచ్చే ఆదాయం ఇంత ఉంది, మేము ముసలివారము అయితే చూసేవారు ఉన్నారు అని ఇటువంటి గోడవలను ఆశ్రయిస్తున్నాము కాని భగవంతుడిని ఉపాసన చేస్తూ, భగవంతుడే మనకు దిక్కు అనే భావన మనకు రావటంలేదు. అందుచేతనే నన్ను ఆశ్రయించండి అని భగవంతుడు చెపుతున్నాడు. వాడి గొప్పలకోసం, గౌరవాలకోసం డబ్బును ఖర్చుపెడుతున్నాడు కాని భగవంతుడి దయను సంపాదించటంకోసం ఎవడూ డబ్బు ఖర్చుపెట్టడు. ఎందుచేతనంటే భగవంతుడు ఉన్నాడనే నమ్మకం మనకు లేదు. మనం ప్రాపంచికవిషయాలను సపోర్టుగా పెట్టుకొంటున్నాము గాని భగవంతుడిని సపోర్టుగా పెట్టుకోవటంలేదు.

విషయాలు మిమ్మల్ని బాధపెడుతున్నాయి అనుకోండి, బాధపెడుతున్నాయి, బాధపెడుతున్నాయి అనుకోకూడదు. భగవంతుడి యందు భక్తి పెంచుకొంటే ఇవి తగ్గిపోతాయి, మీకు ఎవరైతే బాగా ఇష్టమో వారు మొట్టికాయలు మొట్టకపోతే మీకు వైరాగ్యం రాదు. మీరు ఎవరికోసం బతుకుతున్నారో వారు పట్టుకొని మిమ్మల్ని కొట్టేస్తారు అనుకోండి, అప్పడు మీకు ఎంతోకొంత వైరాగ్యం వస్తుంది. మనం విషయాలను ఎంజాయ్ చేయటంవలన అవి మనలో వాసనలకింద పడతాయి. కొన్నివేల జన్మలనుండి ఈ వాసనలు వస్తున్నాయి. ఈ వాసనలను పోగొట్టుకోవటం చాలా కష్టం. మనం జ్ఞానం గురించి విన్నా లోపల వాసనలు ఉన్నప్పడు అది నిలబడదు. పూర్తిగా వాసనాక్షయం అయితేగాని మనకు జ్ఞానం కలుగదు. ఈలోపుగా మీరు మంచి విషయాలు వింటే చాలాబాగున్నాయి, శాంతిగా ఉంది అని మీరు అనుకొంటారు. కాని ఆ సుఖాన్ని, శాంతిని లోపల ఉన్న వాసన నిలబడనివ్వదు. ఆవాసన వేరుతో సహా నశించాలి. దానికి మీరు ప్రయత్నం చేయాలి, గురువు దయ ఉండాలి, ఈశ్వర కటాక్షం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసివస్తేగాని వాసన నశించదు. ఈ శరీరం ఎవరిది అంటే నాది అంటాము అంటే అక్కడ నేను శరీరంతో తాదాత్మ్యం పొందుతోంది. ఇక్కడ అనేక శరీరాలు ఉన్నాయి, అందరి శరీరాలు నావి అనుకోవటం లేదు. ఫలానా శరీరమే నాది అనుకొంటున్నాను. ఆ భావన పూర్తిగా నశించాలి. అంటే వ్యక్తిభావన పోవాలి. తపస్సు అంటే ఎండింపచేయటం. మనస్సును, ఇంద్రియాలను నూటికి నూరుపాళ్ళు ఎవడైతే స్వాధీనం చేసుకొన్నాడో వాడి తపస్సు ఫలించినట్లు అవుతుంది. మనం ఏదైనా ఒక విషయం గురించి ఆలోచించేటప్పడు ఉద్రేకంగా ఆలోచిస్తే మనం నష్టపోతాము, ప్రశాంతంగా ఆలోచించినప్పడే మంచి భావాలు వస్తాయి. పూర్వం అనేకమంది జ్ఞాన తపస్సులు చేసి, నా పాదాలయందు

భక్తి కలిగి ఉండి, నాకు ఇష్టమైన పనులు చేస్తూ, నేను వద్దని చెప్పిన పనులు మానేసి, వారి మనోదేహములను నా చుట్టూ తిప్పకొంటూ, విచారణ చేసి, ధ్యానంచేసి నా అనుగ్రహాన్ని సంపాదించి పవిత్రులు అయ్యి నా స్వరూపాన్ని పొందారు. అర్జునా నువ్వు కూడా అలా నడవటానికి ప్రయత్నం చెయ్యి, పెద్దలు నడిచిన మార్గంలో ప్రయాణించి నువ్వు కూడా తరించు అని చెపుతున్నాడు.

దేవుడు ఉన్నాడా లేడా అనే మాట వదిలివేయండి. మీరు ఉన్నారు కదా. నేను లేను అని ఎవడూ అనటం లేదుకదా. నేను ఉన్నాను అనటంలో ఎవరికీ అనుమానం లేదు. మీరు బయట గొడవలతో కలవవద్దు. మీకు వంద రూపాయలు ఉన్నాయి అనుకోండి. అస్తమానూ అదే లెక్కపెట్టుకొంటూ ఉంటే నూట ఒకటి అవుతుందా, ఎప్పడూ వందే ఉంటుంది. మీకు పొలం ఉంది కాని మీరు పొలం కాదు. మీకు డబ్బు ఉంది కాని మీరు డబ్బు కాదు. మీరు మీరే. ఇది గుర్తు పెట్టుకోండి. నేను ఇలా ఉన్నాను, అలా ఉన్నాను అని మీ వృత్తితోగాని, మీ దేహంతోగాని దేనితోను తాదాత్మ్యం లేకుండా ఉండండి. అప్పడు ఈ నేనుకు మేత తగ్గిపోయి నెమ్మదిగా పల్చబడి, అంతర్ముఖమయ్యి, అది నశిస్తుంది. మనకి జీవితంలో అదృష్టం వస్తూ ఉంటుంది వెళ్ళిపోతుంది, దురదృష్టం వస్తూ ఉంటుంది వెళ్ళిపోతుంది. మీ దేహప్రారబ్ధాన్నిబట్టి రోజులు వెళ్ళిపోతాయి మీరు మాత్రం దేనితోను కలవవద్దు. అలా ఉన్నాను అనుకోవద్దు, ఇలా ఉన్నాను అనుకోవద్దు. మీరు మీరుగా ఉండండి, మీకు మోక్షం తొందరగా వస్తుంది. ముందు జాగ్రత్త పడలేకపోయాము. మన చెయ్యి దాటిపోయింది, ఇప్పడు ఏమి చెయ్యగలము అంటారు. ముందు జాగ్రత్త పడితే మటుకు నీ చేతిలో ఏముంది, నువ్వు బొమ్మవు మాత్రమే, అంతా భగవంతుడి చేతిలో ఉంది, ఆయన సంకల్పం ప్రకారమే అంతా నడుస్తుంది.

నీ చేతిలో ఉన్న పనిని నువ్వు హృదయపూర్వకంగా చేయాలి, అది కర్మ. భగవంతుడు వద్దని చెప్పినది వికర్మ. ఏ పని చేస్తే నీకు దుఃఖం వస్తుందో, భవిష్యత్‌లో అశాంతి వస్తుందో ఆ పని చెయ్యవద్దని భగవంతుడు చెప్పాడు. అంటే నువ్వు చేయకూడనిపని అది వికర్మ. బుద్ధిమంతుడు, వివేకవంతుడు అయినవాడు వికర్మ మాట వదిలేయండి అది ఎలాగు చేయకూడని పనే, కర్మలో అకర్మను చూస్తాడు అంటే వాడు చేసినా చేయనివాడితో సమానము. భగవంతుడు పని చేస్తున్నాడు, ఆయన ఎలా పని చేస్తున్నాడో ముందు మనకు అర్థమవ్వాలి. ఆయనకు కర్మఫలం పట్ల ఆసక్తిలేదు, కోరికలేదు కాని పనిచేస్తున్నాడు మీరు కూడా అలా పనిచేస్తే కర్మ మిమ్మల్ని చుట్టుకోదు. అసలు మీకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే మీరు చనిపోయాక స్వర్గం కాదు, ఈ భూమి మీదే స్వర్గం అనుభవిస్తారు. అంటే స్వర్గంలో ఏ సుఖాలు అయితే ఉన్నాయో అంతకంటే ఉత్తమ సుఖాన్ని ఇక్కడ పొందుతారు. మీరు రాగద్వేషాలు లేకుండా పని చేస్తారు అనుకోండి అప్పడు కర్మ మిమ్మల్ని బంధించదు. కోరికతో చేసిన కర్మ బంధిస్తుంది. కర్మలో అకర్మను చూడటం అంటే వ్యక్తిభావన లేకుండా, దేహభావన

లేకుండా పనిచేస్తే అది అకర్మ అవుతుంది. అంటే కర్తలేనికర్మ అవుతుంది. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా బ్రహ్మభావనతో పనిచేస్తే నువ్వు చేసినా చెయ్యనివాడితో సమానమవుతావు.

మీరు ఏదైనా మంచిపని చేసారు అనుకోండి. ఏమండీ మీరు మంచిపని చేసారు అని ఎవరైనా అంటే మీకు సంతోషం వస్తుంది. అంటే అక్కడ మీరు కర్తతో చేసినట్లు. మీరు చేసిన పని ఎవరికీ ఉపయోగపడదు, ఏవో గొప్పలకోసం పనులు చేసారు అంటే వెంటనే మీకు దుఃఖం వస్తుంది అంటే అక్కడ కర్తతో చేసినట్లు, అంటే లోపల నేను అనే భావన ఉంది కదా. నేను అనే భావన లేకుండా పనిచేస్తే నువ్వు కర్మలో అకర్మను చూస్తావు, అప్పుడు కర్మ నిన్ను బంధించదు. మీరు మంచిపని చేసినంత మాత్రంచేత అందరూ మిమ్మల్ని గౌరవిస్తారు అనుకోవద్దు, దూషించే వారు కూడా ఉన్నారు. ఆ గొడవలు వద్దు. అక్కడ అవసరం కాబట్టి నువ్వు పని చేసావు అంతవరకే. కృష్ణుడు గీతలో ఏమన్నాడు అంటే నేను పని చేసి సంపాదించేది లేదు, ఒకవేళ పనిమానివేస్తే వచ్చే నష్టం లేదు అన్నాడు. ఎందుచేతనంటే ఆయన పూర్ణపురుషుడు. జీవుడికి లాభం నష్టం ఉంటాయికాని దేవుడికి లాభంలేదు, నష్టం లేదు, వ్యక్తిభావన లేకుండా, మమకారం లేకుండా సమానబుద్ధితో పనిచేస్తూ ఉంటే ఆ పని మిమ్మల్ని బంధించదు. లోపల వ్యక్తిభావన పెట్టుకొని పనిచేస్తూ ఉంటే తప్పనిసరిగా ఆ కర్మ మిమ్మల్ని చుట్టుకొంటుంది. ఆ కర్మ ఫలితం ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోనికి రావలసిందే. నువ్వు ఏమనుకొంటున్నావు అంటే నేను పని చేస్తున్నాను, దేవుడు పని చేయటంలేదు అనుకొంటున్నావు. ఎందుచేతనంటే మనిషి చేసే పని కళ్ళకు కనిపిస్తుంది, దేవుడు చేసేపని కళ్ళకు కనబడదు. ఎందుచేతనంటే అక్కడ వ్యక్తిభావనలేదు. నీ సంకల్పంతోటి, తలంపుతోటి, నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా ఒకోసారి పని జరిగిపోతుంది. అది ఎవరు చేసారు అంటే అది దేవుడి చేసిన పని, అది అకర్మ, అకర్మలో కర్మను చూడటం నేర్చుకొంటే ఇంక నీకు దుఃఖం ఏమిటి అంటున్నారు మధ్వాచార్యులు. స్వప్నంలో ఒకోసారి మనం చాలా కష్టపడి పనిచేస్తున్నట్లు అనిపిస్తుంది. అప్పుడు నిజంగా నీ శరీరంగాని, ఇంద్రియాలుగాని పనిచేస్తున్నాయా, పనిచేయటంలేదు. కాని స్వప్నంలో నేను కష్టపడిపోతున్నాను అని నీవు అనుకొంటున్నావు కదా. అక్కడ నీ దేహంమటుకు ఏమీ కష్టపడటంలేదు. అది అకర్మలో కర్మను చూడటం. నువ్వు ఏమీ పని చెయ్యకపోయినా పనిచేస్తున్నాను అనుకొంటున్నావు కాబట్టి అది అకర్మలో కర్మను చూడటం. ఈ జీవితం కూడా అటువంటిదే.

మీకు చెడ్డస్వప్నం వచ్చింది అనుకోండి. మెలకువ వచ్చాక ఆ చెడ్డ స్వప్నం గురించి మీరు ఏమైనా బాధపడతారా, బాధపడరు. ఎందుచేతనంటే అది అబద్ధం అని తెలిసిపోయింది. స్వప్నం అబద్ధం అని జాగ్రదవస్థలోనికి వచ్చాక మనకు తెలుస్తుంది. స్వప్నావస్థలో నుండి జాగ్రదవస్థలోనికి ఎలా మేల్కొన్నామో అలాగే జాగ్రదవస్థలోనుండి ఆత్మజ్ఞానంలోనికి మేల్కొంటే

ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నం అని తెలిసిపోతుంది. మీరు బ్రహ్మంలో మేల్కొన్నప్పుడు అంటే చూచేవాడు, చూడబడేది, చూడటం అనేది ఈ త్రిపుటి పోయిన స్థితిలో ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నం అని తెలిసిపోతుంది. అది అబద్ధం అని తెలిసాక అది అదృష్టం అయితే ఏముంది, దురదృష్టం అయితే ఏముంది. జ్ఞానం కావాలి అనుకొనేవారికి వివేకం ఉండాలి, వైరాగ్యం ఉండాలి, విచక్షణ ఉండాలి, ఈ జన్మలోనే పొందాలి లేకపోతే ఆ ప్రయత్నంలో చనిపోదాం అనే దృఢనిశ్చయం ఉండాలి. ఇవి అన్నీ ఉంటేగాని మనం ఆత్మజ్ఞానాన్ని పొందలేము. మనం అనాత్మను ఆత్మగా చూస్తున్నాము. అనాత్మ మీద కాంక్ష పెంచుకొంటున్నాము. జ్ఞానం కావాలి అనుకొనేవాడికి ఇది తగ్గాలి. ఆధ్యాత్మిక విషయాలే కాదు భౌతిక విషయాలు కూడా ఎవరు ఏది చెపితే అది నిజం అని నమ్ముతాము. చాలామంది అలా మోసం చేస్తారు. జీవితంలో మోసపోవటమే మన పని. మనకు తెలివిలేనప్పుడు ఏమి చేస్తాము అంతేమరి. చేలో నీరు బయటకు పోయింది అని బాధపడుతూ కూర్చోవటంకంటే కొత్తనీరు పెట్టుకోవటం మంచిది. ఇప్పుడు మనకు 70 ఏళ్ళు వచ్చేసాయి. ఇప్పటివరకు ఏమీ సాధన చేయలేదు అని బెంగపెట్టుకోవటంకంటే ఈ రోజునుంచి అయినా సాధన మొదలుపెట్టటం మంచిది. బెంగపెట్టుకోవటం వలన ఏమి వస్తుంది. మనం చనిపోవటానికి ఇంకా కొంతటైము ఉంది కదా. ఇప్పటినుండి సాధన చేస్తే ఆ టైము కలిసివస్తుంది. గతించిన విషయాలను గురించి బెంగపెట్టుకోవటంకంటే రాబోయే కాలాన్ని ఉపయోగించుకో అని పరమాత్మ గీతలో చెప్పాడు.

ఈ శరీరాలు పుట్టటం స్వప్నం, ఈ శరీరాలు చనిపోవటం స్వప్నం, ఈ జన్మలు స్వప్నం. మన కుటుంబ సభ్యులను, మన స్నేహితులను, బంధువులను మనస్సే కల్పించింది. ఈ దేహాన్ని, ప్రపంచాన్ని మనస్సే కల్పించింది. ఈ బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులు అన్నీ కూడా మనస్సు ఎంత నిజమో వారు కూడా అంతే నిజం. మనస్సు అనే గెడపదాటితే ఈ సృష్టిని దాటినట్లే. నా మాయను జయించటం చాలా కష్టం. మీరు సాధన చేసినా నా దయ లేకుండా నా మాయను జయించలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీరు సాధన బాగా చేస్తున్నారు అనుకోండి. మీకు ఏదైనా ఆకర్షణీయమైన సంఘటన చూపించాడు అనుకోండి సడన్‌గా మీ మనస్సు వెళ్ళి అక్కడ పడిపోతుంది, ఫెయిల్ అయిపోతారు. వందఏళ్ళనుండి కష్టపడి చేసిన సాధన అంతా బూడిద అయిపోతుంది. నా మాయ అంత బలీయమైనది. మీరు ఒడ్డుకు వచ్చాక ఒడ్డుకు వచ్చాము అనుకోండి కాని మధ్యలో అనుకోవద్దు. మీరు సాధన చెయ్యండి, ప్రయత్నం చెయ్యండి, మంచి చెయ్యండి కాని మీరు పరమస్థితిని పొందేటప్పుడు నా దయలేకుండా పొందుదామని మీరు అనుకోవద్దు, అది మీవల్ల కాదు, నువ్వెంత నీ సాధన ఎంత నా దయ లేకుండా నువ్వు పొందేది ఏమీ లేదు అంటున్నాడు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మే | 18 | శంకర జయంతి, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

## సద్గురు శ్రీనాన్నగారి ప్రవచనముల నుండి "అమృత గుళికలు"

1. ఆత్మజ్ఞానం లేని జీవితం శవాలంకరణ వంటిది.
2. చైతన్యము, జ్ఞానము, ఈశ్వరుడు, ఆత్మ, అమృతస్థితి, శాంతి, గురువు, సత్యము ఇవన్నీ ఏకవస్తువే అదే అద్వయ బ్రహ్మము.
3. మన హృదయంలో ఉన్న సత్యవస్తువే నిజమైన గురువు.
4. నీవెవరివో తెలుసుకో! అదే సకల వేదాల సాధనల సారం.
5. తనను తెలియుటయే దేవుని తెలియుట.
6. ఆధ్యాత్మికతకు అర్హత సహృదయం.
7. మనోనాశమే ఆధ్యాత్మిక సాధనల పరమగమ్యం.
8. ఒక్క బ్రహ్మము (ఆత్మ) తప్ప అన్నీ మనోకల్పితాలే!
9. మనస్సు నశిస్తే చైతన్యం తానుగా అనుభవంలోకి వస్తుంది.
10. సృష్టిలో ఏదైనా పనికిరాని వస్తువు అంటూ ఉంటే అది అహంకారము (లేక) అహంభావన మాత్రమే!
11. అహంకారం అణిగే కొలది ఈశ్వరుని సహాయం అందుతుంది.
12. నీలోని లోపాలను భూతద్దంలో చూచుకో! ఇతరులలో కనబడే దోషాలు మన దోషాలే!
13. జగత్తుకు సూర్యుడు ఎట్లో, దేహానికి హృదయం అట్లు.
14. ఎవరి మనస్సును వారు సంస్కరించుకొనుటయే నిజమైన విప్లవం.
15. సత్యాన్వేషకుడే సాధకుడు.
16. మన అశాంతికి, దుఃఖమునకు కారణం మనలోపల అహంభావన రూపంలో ఉంది.
17. నీవు ఏ వృత్తిలో ఉన్నా అహంవృత్తిలో లేకుండ జీవించు.
18. మోక్షం అంటే మన నిజమైన ఇంటికి మనం వెళ్ళడం.
19. తేలిపోతున్న మనస్సును హృదయంలోకి ముంచడానికి సహకరించే వాడే గురువు.
20. ఎంత చిన్న పని అయినా చిత్తశుద్ధితో, ప్రేమతో చెయ్యాలి.

**చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# దైవ విశ్వాసం సంరక్షిస్తుంది - అనుమానం ముంచేస్తుంది

ఎవరు సత్య శోధనలో ఉన్నారో వారు ధన్యులు. ఎవరు దృశ్యమంతా నిజమనుకొని దైవం లేడు అనుకొంటాడో వారు భాగ్యహీనులు. నిజభక్తుని ప్రార్థన ఇలా ఉంటుంది "తండ్రీ! ధనం మీద, కామం మీద ఆసక్తి లేదు నా ప్రారబ్దంలో ఏది జరగాలో అది జరుగుతుంది. జన్మ జన్మలకు నీ పాదాల మీద నిశ్చల భక్తి కలిగి ఉండేలా చూడు" అని. మరి భగవంతుని హామీ ఇలా ఉంటుంది "నన్ను స్మరించు - నిన్ను స్మరిస్తాను. నన్ను విశ్వసించు - నిన్ను ఉద్ధరిస్తాను. నాపై భారం ఉంచు - రక్షకుడుగా ఉంటాను. శరణాగతి చెందు - నేనే చూచుకొంటాను. నేను ఎక్కడో లేను - నీ హృదయంలో ఉన్నాను" అని. త్యాగరాజు "ఉపచారం చేసేవారు వాకిటలోనే ఉన్నారు అని మరువకుమా!" అన్నారు. దైవ విశ్వాసం కొండలను కదిలిస్తుంది. విశ్వాసానికి మించిన సంపద మరియొకటి ఈ సృష్టిలో లేదు. ఒకడు సముద్రాన్ని లంఘించాలని ఒక స్వామిని ఆశ్రయిస్తే ఒక చీటిలో ఒక మంత్రాన్ని వ్రాసి మొలకు కట్టి దీనిపై విశ్వాసంతో లంఘించు అనగా ఆతను అవలీలగా సముద్రాన్ని దాటుతూ ఆశ్చర్యంగా ఈ చీటీలో ఏముంది అని అనుమానంగా చూడగా "శ్రీరామ" అని ఉండటం చూచి ఓసి ఈ మాటేనా అని అవిశ్వాసంతో ఉన్న క్షణంలో సముద్రంలో మునిగిపోయాడు. భగవంతుణ్ణి స్మరించకుండా ఉండలేనప్పడు ఆయన గురించి ఆలోచించకుండా ఉండలేనప్పడు ఆయనే మనలను ప్రేమిస్తున్నాడని గ్రహించాలి. భగవదనుగ్రహానికి అదే కొలబద్ద, ప్రహ్లాదుడు దానికి ఉదాహరణ. శ్రీ నాన్నగారు "ఈశ్వరుని పాదాలు చూడగానే ఆనందపరవశుడు అవుతాడు భాగవతుడు" అన్నారు. అన్ని విషయాల్లోనూ ఎప్పడూ భగవంతుణ్ణి చూస్తే ఇక పాపము అనేది కనబడదు. అనుమానం పెట్టుకొంటే అన్నిచోట్లా పాపమే కనిపిస్తుంది. దైవ విశ్వాసం ఉంటే మనస్సు, మంచినే చూస్తుంది. శ్రీరామకృష్ణులు దేహాన్ని చాలించాక వారి భక్తులు వారి పటాన్ని సజీవమూర్తిగా భావించేవారు. రాత్రి 12 గంటలకు ఉక్కబోస్తే రాత్రి అంతా విసినకర్రతో విసిరి స్వామి నిద్రపోయాడని నిశ్శబ్ధంగా ఉండటం చూచి ఒకరు అది ఎలా సాధ్యం అని అంటే "ప్రేమకు ఆ శక్తి ఉంది" అన్నారు. చనిపోయేవాడు గురువు కాదనే విశ్వాసం ఉండాలి. మంచి వారికి ఈ ప్రపంచం అంతా మంచే. భక్తుడికి గురువు భగవంతుడిలా కనిపిస్తాడు. అదే ప్రకృతి మనుషులకు మనిషిలా కనిపిస్తాడు. జీవితం పట్ల మనకున్న వైఖరే దానికి కొలబద్ద. ప్రతీవారికీ స్వంతకొలబద్ధలు ఉంటాయి. మన మనస్సులో ఏది ప్రతిఫలిస్తే దాన్నే బయట చూస్తాము అన్నిటా దైవాన్ని దర్శించినవాడే ధన్యుడు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం